క్లుప్తంగా

కొనసాగుతున్న లారీ అసోసియేషన్ సమ్మె

కాగజ్‌నగర్‌టౌన్: కాగజ్‌నగర్ లారీ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ చేపట్టిన సమ్మె శనివారం 4వ రోజుకు చేరుకుంది. శనివారం ఎస్పీఎం, అసోసియేషన్ మధ్య జరిగిన చర్చలు విఫలం కావడంతో అసోసియేషన్ సభ్యులు తమ కార్యాలయం ఎదుట నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. పెరిగిన డీజిల్, పెట్రోల్ ధరలకు అనుగుణంగా ట్రాన్స్‌పోర్టు ధరలు పెంచి, మిల్లులో ఉత్పత్తి అయిన కాగితం రవాణాలో కాగజ్‌నగర్ అసోసియేషన్‌కు మొదటి ప్రాధాన్యత ఇవ్వాలని డిమాండ్ చేశారు.

పట్నాపూర్‌లో ప్రత్యేక వైద్య శిబిరం

జైనూర్: ఐటీడీఏ ఆధ్వర్యంలో మండలంలోని పట్నాపూర్ గ్రామంలో శనివారం ప్రత్యేక వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఐటీడీఏ అదనపు డీఎంహెచ్‌వో కుమ్ర బాలు మాట్లాడుతూ ఏజెన్సీ ప్రాంత ప్రజలకు ప్రత్యేక వైద్య చికిత్సలు అందించేందుకు ఐటీడీఏ పీవో చాహత్ బాజ్‌పాయ్ ఆదేశాల మేరకు ప్రత్యేక వైద్య శిబిరం నిర్వహించినట్లు పేర్కొన్నారు. అనంతరం సీజనల్ వ్యాధులపై తీసుకునే జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఆదివాసీ మిత్ర వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షుడు ఆడ వెంకటేశ్, సర్పంచి ఖందారే బాలాజీ, వైద్య సిబ్బంది, గ్రామస్తులు తదితరులు ఉన్నారు.

ఎస్సైని కలిసిన రాజకీయ పార్టీల నాయకులు



ఎస్సై చంద్రశేఖర్‌ను సన్మానిస్తున్న నాయకులు

రెబ్బెన: మండల నూతన ఎస్సైగా ఇటీవల బాధ్యతలు చేపట్టిన డొలకాని చంద్రశేఖర్‌ను శుక్రవారం పలు రాజకీయ పార్టీల నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. బీఆర్ఎస్, బీజేపీ, సీపీఐ, ఏఐటీయూసీ, ఎమ్మార్పీఎస్ నాయకులు వేర్వేరుగా ఎస్సైని కలిసి సన్మానించారు. బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు శ్రీధర్ రెడ్డి, సర్పంచుల సంఘం మండల అధ్యక్షుడు సోమశేఖర్, శ్రీనివాస్‌గౌడ్, భీమేష్, ఆయా పార్టీల నాయకులు ఉన్నారు.

వేధింపులకు గురిచేసిన అధికారులను శిక్షించాలి



కార్మిక సంఘాల నాయకులతో కలిసి మాట్లాడుతున్న స్నేహ

రెబ్బెన: తన నాన్నను వేధింపులకు గురి చేసి ఆసుపత్రి పాలు కావడానికి కారణమైన అధికారులను కఠినంగా శిక్షించాలని బెల్లంపల్లి ఏరియాలో ఎస్అండ్‌పీసీ విభాగంలో జమేదార్‌గా పని చేస్తున్న పొట్ట శ్రీనివాస్ కూతురు స్నేహ డిమాండ్ చేశారు. శుక్రవారం గోలేటి టౌన్‌షిప్‌లో టీబీజీకేఎస్, ఏఐటీయూసీ, హెచ్ఎంఎస్, ఐఎన్టీయూసీ నాయకులను కలిసి తమకు న్యాయం జరిగేలా చూడాలని కోరుతూ వినతిపత్రాలు అందజేశారు. శ్రీనివాస్‌కు న్యాయం జరిగే వరకు కార్మిక సంఘాలు అండగా ఉంటాయని నాయకులు తెలిపారు. కార్యక్రమంలో హెచ్ఎంఎస్ ఏరియా ఉపాధ్యక్షుడు రాజాబాబు, ఐఎన్టీయూసీ ఏరియా ఉపాధ్యక్షుడు పేరం శ్రీనివాస్ పాల్గొన్నారు.

విద్యార్థులకు ఉచిత మెటీరియల్ పంపిణీ

సిర్పూర్(టి): మండలంలోని చీలపెల్లి గ్రామంలో గల ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలలోని విద్యార్థులకు శనివారం పీఆర్టీయూ మండల కమిటీ ఆధ్వర్యంలో ఉచితంగా పరీక్ష మెటీరియల్ పంపిణీ చేశారు. వారు మాట్లాడుతూ మారుమూల గ్రామాల్లోని విద్యార్థుల విద్యాభివృద్ధికి పీఆర్టీయూ టీఎస్ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. సర్పంచ్ బ్రహ్మయ్య, స్కూల్ కమిటీ చైర్మన్ లింగమూర్తి, పీఆర్టీయూ టీఎస్ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్‌రావు, మండల అధ్యక్షుడు దేవాజి, పురుషోత్తం, ప్రధానోపాధ్యాయులు అబ్దుల్ అజీజ్, ఇజార్ హుస్సేన్, పురుషోత్తం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గిరిజన విద్య బలోపేతానికి కృషి చేయాలి



పుస్తకాలు అందజేస్తున్న సర్పంచ్

ఆసిఫాబాద్‌రూరల్: గిరిజన విద్యార్థులకు విద్య మరింత చేరువచేసేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని సర్పంచ్ దినకర్ అన్నారు. శనివారం మండలంలో వట్టివాగు కాలనీ గిరిజన పాఠశాలలో లెర్న్ ఏ వరల్డ్ డే లో భాగంగా హెచ్ఎంతో కలిసి విద్యార్థులకు పుస్తకాలు అందజేశారు. ఎంపీటీసీ శంకర్, ఉపాధ్యాయులు రవీందర్, తుకారం ఉన్నారు.

అసౌకర్యాల పాఠశాల!

- డబ్బా ఉన్నత పాఠశాలలో విద్యార్థుల తిప్పలు
- పిచ్చిమొక్కలకు ఆవాసంగా మారిన ఆవరణ



పాఠశాల ఆవరణలో పిచ్చిమొక్కలు



నిర్మాణ దశలోనే కూలుతున్న తరగతి గదులు

చింతలమానెపల్లి: మండలంలోని డబ్బా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో వసతులు లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. పాఠశాలలో కనీస సౌకర్యాలు మరుగుదొడ్లు, వంటగది, భోజనశాల, ప్రహరీ, తరగతి గదులు, కంప్యూటర్ ల్యాబ్‌లు లేవు. మరోవైపు పాఠశాల ఆవరణలో చెత్తాచెదారం నిండి ఉండడంతో విద్యార్థుల అవస్థలు వర్ణనాతీతంగా ఉన్నాయి.

ఇదీ పరిస్థితి..

మండలంలోని డబ్బా జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో 6 నుంచి 10వ తరగతి వరకు 144 మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. పాఠశాలలో బాలికలు 74 మంది, బాలురు 70 మంది ఉన్నారు. ఈగ్రామం పరిధిలోని కొత్తగూడ, రెబ్బెన, బారెగూడ, దరంపెల్లి, అడెపెల్లి గ్రామాల విద్యార్థులు పాఠశాలలో విద్యనభ్యసిస్తున్నారు. కాగా గ్రామంలో ఒకే ఆవరణలో ప్రాథమిక, ఉన్నత పాఠశాలలను నిర్వహిస్తున్నారు. విద్యార్థులకు అవసరమైన మరుగుదొడ్లు, వంటగది, భోజనశాల, ప్రహరీ, తరగతి గదులు, కంప్యూటర్ ల్యాబ్‌లు లేక నానాఅవస్థలు పడుతున్నారు.

ఒకే గదిలో స్టోర్, ల్యాబ్..

పాఠశాలలో తరగతి గదుల కొరత కారణంగా ఇరుకుగా ఉండే స్థలంలో రెండు తరగతులను కలిపి నిర్వహిస్తున్నారు. 5 తరగతులు, స్టాఫ్ రూం, స్టోర్ రూం, ల్యాబ్, కార్యాలయం, గ్రంథాలయం, కంప్యూటర్ ల్యాబ్‌లకు మొత్తంగా కనీసం 11 గదులు అవసరం ఉండగా కేవలం నాలుగు గదుల్లోనే పాఠశాలను నిర్వహిస్తున్నారు. వరండాలో, పాఠశాల ఆవరణలోని చెట్ల కింద తరగతులు కొనసాగుతున్నాయి. ఒకే గదిలో పాఠశాల స్టోర్ రూం, 8వ తరగతి, సైన్స్ ల్యాబ్ నిర్వహించడం గమనార్హం.

విద్యార్థుల ఇక్కట్లు..

ప్రహరీ నిర్మాణం పూర్తయినా అసంపూర్తిగా ఉండడంతో పాటు గేటు లేకపోవడంతో పాఠశాల ఆవరణలో కుక్కలు, పశువులు సంచరిస్తున్నాయి. దీంతో విద్యార్థులు భయాందోళన చెందుతున్నారు. మరుగుదొడ్ల నిర్మాణం చేపట్టినా నిర్వహణ లేకపోవడంతో అధ్వానంగా ఉన్నాయి. పాఠశాల ఆవరణలో పారిశుధ్యం లోపించింది. పాఠశాలలో కూల్చి వేసిన చెట్ల కలపను నిల్వ ఉంచారు. మరోవైపు పిచ్చి మొక్కలు పెరిగాయి. చెత్తా చెదారం తొలగించక పోవడంతో విద్యార్థులు తిప్పలు పడుతున్నారు. వరండాలో, ఆవరణలో చదువుకోవడం వల్ల రహదారిపై వెళ్లే వాహనాల కారణంగా చదువుపై దృష్టి సారించలేకపోతున్నామని విద్యార్థులు వాపోతున్నారు.

నిధులు మంజూరైనా..

మన ఊరు మన బడి పథకం కింద పాఠశాలను ఎంపిక చేశారు. పాఠశాలలో తరగతి గదుల నిర్మాణం, భోజన శాల, ప్రహరీగోడల నిర్మాణానికి నిధులు మంజూరయ్యాయి. గత జూలైలోపే పనులు పూర్తి చేయాల్సి ఉండగా కాంట్రాక్టర్ నిర్లక్ష్యంతో పనులు ఇప్పటికీ పూర్తి కాలేదు. కాగా నాసిరకంగా నిర్మాణాలు చేపడుతున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. అధికారులు స్పందించి పాఠశాలలోని సమస్యలు పరిష్కరించాలని కోరుతున్నారు.

ఈ- కేవైసీ తప్పనిసరి

- ఆరోగ్యశ్రీ ద్వారా రూ.5లక్షల వరకు లబ్ధి
- ఈనెల 30లోపు కేవైసీకి అవకాశం
- జిల్లాలో 1,28,167 మందికి మేలు

ఆసిఫాబాద్‌అర్బన్: రాష్ట్ర వ్యాప్తంగా దారిద్ర్యరేఖకు దిగువన ఉన్న ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకొని రాష్ట్ర ప్రభుత్వం ఆరోగ్యశ్రీ పథకాన్ని అమలు చేస్తోంది. ఈ పథకం ద్వారా పేద కుటుంబాలకు కార్పొరేట్ స్థాయి వైద్యం అందిస్తున్నారు. పథకంలో భాగంగా దాదాపు 1,672 వ్యాధులకు చికిత్స అందజేస్తున్నారు. ఇందు కోసం రూ.2లక్షల వరకు ప్రభుత్వం చెల్లిస్తోంది. ప్రస్తుతం ఆ మొత్తాన్ని రూ.5లక్షల వరకు పెంచి ఇవ్వనున్నట్లు ప్రభుత్వం ఇటీవల ప్రకటించింది. అయితే పెరిగిన మొత్తం వర్తించాలంటే ఈ- కేవైసీ తప్పనిసరి చేసింది.

పాతకార్డుల స్థానంలో కొత్తవి..

ఆరోగ్యశ్రీ సేవలను వర్తింపజేయడానికి పాత కార్డుల స్థానంలో డిజిటల్ కార్డులు ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇందుకు ఆరోగ్యశ్రీకి అర్హత కలిగిన ప్రతీ కుటుంబం ఈ -కేవైసీ చేయించుకోవాల్సి ఉంటుంది. గ్రామ పంచాయతీల పరిధిలో ఉన్న కామన్ సర్వీస్ సెంటర్ (సీఎస్‌సీ)లలో ఈ -కేవైసీ చేసుకునేందుకు అనుమతినిచ్చింది. ప్రస్తుతం ఆరోగ్యశ్రీ కలిగి ఉన్న ప్రతీ కుటుంబం తమ రేషన్ కార్డుతో పాటు ఆధార్, దీనికి లింకైన సెల్ నంబర్‌తో సహా కుటుంబ సభ్యులు విధిగా కామన్ సర్వీస్ సెంటర్‌కు వెళ్లి ఈ కేవైసీ చేయించుకోవాలి. ఈ కేవైసీ చేయించుకునేందుకు ఈనెల 30 వరకు గడువు ఉంది. జిల్లాలోని 13,066 కుటుంబాల్లో 1,28,167 మంది ఆరోగ్యశ్రీ పథకానికి అర్హులుగా ఉన్నారు. లబ్ధిదారుల జాబితాను రూపొందించి ఈ కేవైసీ చేసుకోవాలని ఉన్నతాధికారులు ఆదేశించారు. జిల్లా వ్యాప్తంగా తెల్లరేషన్ కార్డు కలిగిన లబ్ధిదారుల వివరాలు వెబ్‌సైట్‌లో పొందుపర్చారు.

సద్వినియోగం చేసుకోవాలి

జిల్లా వ్యాప్తంగా ఉన్న తెల్లరేషన్ కార్డుదారులు సీఎస్‌సీ సెంటర్‌కు వెళ్లి ఈ -కేవైసీ చేసుకోవాలి. అప్పుడే పెరిగిన రూ. 5 లక్షల ఆరోగ్యశ్రీ వ్యయం వర్తిస్తుంది. డిజిటల్ కార్డులు కూడా మంజూరు చేస్తున్నాం. అవకాశాన్ని అర్హులు సద్వినియోగం చేసుకోవాలి.

– రాపల్లి సత్యనారాయణ, సీఎస్‌సీ జిల్లా మేనేజర్

శాంతిభద్రతల పరిరక్షణకు సహకరించాలి

పెంచికల్‌పేట్: గ్రామాల్లో శాంతిభద్రతల పరిరక్షణకు ప్రజలు పోలీసులకు సహకరించాలని పెంచికల్‌పేట్ ఎస్సై కొమురయ్య అన్నారు. శనివారం మండలంలోని గుండ్లపేట గ్రామంలో కార్డెన్‌సెర్చ్ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో నాటుసారా తయారు చేసినా, విక్రయించిన కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. అనుమానాస్పద వ్యక్తులు గ్రామాల్లో సంచరిస్తే సమాచారం అందించాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ చంద్రమౌళి, పోలీసు సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎస్సై కొమురయ్య

బడి ఎదుట విద్యార్థుల నిరీక్షణ

రెబ్బెన: మండలంలోని నక్కలగూడ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో పని చేసే ఉపాధ్యాయుడు శనివారం ఆలస్యంగా పాఠశాలకు హాజరు కావటంతో సకాలంలో పాఠశాల తెరుచుకోలేదు. దీంతో విద్యార్థులు ఉపాధ్యాయుడు వచ్చే వరకు ఆరుబయటే నిరీక్షించారు. విద్యార్థుల తల్లిదండ్రులు తెలిపిన వివరాల ప్రకారం పాఠశాలలో పని చేసే రెగ్యులర్ ఉపాధ్యాయుడు లాంగ్‌లీవ్‌పై వెళ్లటంతో అధికారులు మరో ఉపాధ్యాయుడిని కేటాయించారు. ఉదయం 9.30 గంటలకు రావాల్సిన సదరు ఉపాధ్యాయుడు పాఠశాలకు ఆలస్యంగా 11గంటలకు హాజరు కావటంతో అప్పటి వరకు విద్యార్థులు ఆరుబయటే నిరీక్షించారు. గత రెండు రోజులుగా ఉపాధ్యాయులు రాకపోవటంతో పాఠశాల తెరుచుకోలేదని విద్యార్థుల తల్లిదండ్రులు ఆరోపించారు. ఉపాధ్యాయుడు సమయపాలన పాటించేలా అధికారులు చూడాలని కోరుతున్నారు.



పాఠశాల ఎదుట నిరీక్షిస్తున్న విద్యార్థులు

సీఎం చొరవతోనే కార్మికులకు హక్కులు

రెబ్బెన(ఆసిఫాబాద్): సీఎం కేసీఆర్ ప్రత్యేక చొరవతోనే సింగరేణి కార్మికులకు అనేక హక్కులు దక్కాయని టీబీజీకేఎస్ బెల్లంపల్లి ఏరియా ఉపాధ్యక్షుడు మల్రాజు శ్రీనివాస్‌రావు అన్నారు. 11వ వేజ్ బోర్డుకు సంబంధించిన 23 నెలల ఏరియర్స్ రూ.1,700 కోట్లు ఒకే దఫాలో చెల్లించడం, లాభాల వాటా రూ.700 కోట్లను దసరాకు ముందే చెల్లించనున్న నేపథ్యంలో శనివారం గోలేటి సీహెచ్‌పీలో సీఎం కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. అలాగే చట్టసభల్లో మహిళా రిజర్వేషన్ బిల్లు ఆమోదం పొందేందుకు కృషి చేసిన ఎమ్మెల్సీ కవిత చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో చర్చల ప్రతినిధి దారావత్ మంగీలాల్, మాజీ ఏరియా ఉపాధ్యక్షుడు సదాశివ్, నాయకులు సమ్మయ్య, సంపత్, శ్రీనివాస్, రమేశ్



సీఎం కేసీఆర్, ఎమ్మెల్సీ కవిత చిత్రపటాలకు క్షీరాభిషేకం చేస్తున్న టీబీజీకేఎస్ నాయకులు

వర్క్‌షాప్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

రెబ్బెన: బెల్లంపల్లి ఏరియాలోని ఏరియా వర్క్‌షాప్‌లో పని చేస్తున్న కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని హెచ్ఎంఎస్ ఏరియా ఉపాధ్యక్షుడు పత్తెం రాజాబాబు అన్నారు. శనివారం వర్క్‌షాప్ ఇన్‌చార్జి డీజీఎం నాగభూషణంను కలిసి వినతిపత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ బెల్లంపల్లి ఏరియా మాదారం, గోలేటి భూగర్భ, ఉపరితల గనులకు అనేక రకాలుగా ఉపయోగపడిన యంత్రాల స్పేర్‌పార్ట్స్ లేకపోవటంతో కోట్లాది రూపాయల విలువైన యంత్రాలు పాడై పోతున్నాయన్నారు. వర్క్‌షాప్‌లో సరిపడా సిబ్బందిని ఏర్పాటు చేసి యంత్రాలు పాడైపోకుండా యాజమాన్యం చర్యలు తీసుకోవాలని సూచించారు. ఏరియా ఆర్గనైజర్ ఎస్‌కే ఇనూష్, వర్క్‌పిట్ కార్యదర్శి వసీం, ఎస్అండ్‌పీసీ పిట్ కార్యదర్శి శ్రీనివాస్ పాల్గొన్నారు.

డబ్ల్యూపీఎస్ అండ్ జీఏ కమిటీ ఎన్నిక

రెబ్బెన(ఆసిఫాబాద్): డబ్ల్యూపీఎస్ అండ్ జీఏ బెల్లంపల్లి ఏరియా కమిటీని ఎన్నుకున్నట్లు జీఎం రవిప్రసాద్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఏరియా అధ్యక్షుడిగా జీఎం రవిప్రసాద్, ఉపాధ్యక్షులుగా ఎస్‌వోటూ జీఎం నరేందర్, చీఫ్ కోఆర్డినేటర్‌గా డీవైపీఎం తిరుపతి, గౌరవ కార్యదర్శిగా సీనియర్ పీవో ప్రశాంత్, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా అసిస్టెంట్ స్పోర్ట్స్ సూపర్‌వైజర్ అశోక్, కోఆర్డినేటర్‌గా కైరిగూడ ఈపీ ఆపరేటర్ మురహరిరావ్‌లను ఎన్నుకున్నారు. జనరల్ కెప్టెన్‌గా జీపీ చంద్రకుమార్, ఫుట్‌బాల్ కెప్టెన్‌గా నరేష్, వాలీబాల్ కెప్టెన్‌గా జి.సుగ్రీవులు, బాస్కెట్ బాల్ కెప్టెన్‌గా కే.దేవేందర్, హాకీ కెప్టెన్‌గా సీహెచ్ ప్రవీణ్‌కుమార్, కబడ్డీ కెప్టెన్‌గా అబ్బాస్ అలీ, బాల్ బ్యాడ్మింటన్ కెప్టెన్‌గా శ్రీనివాస్, బాడీ బిల్డింగ్, పవర్ లిఫ్టింగ్ అండ్ వెయిట్ లిఫ్టింగ్ కెప్టెన్‌గా భాస్కరాచారి, టెన్నిస్ కెప్టెన్‌గా కిరణ్‌బాబు, క్రికెట్ కెప్టెన్‌గా మురళీకృష్ణ, అథ్లెటిక్స్ కెప్టెన్‌గా ఓరం కిరణ్, షటిల్ బ్యాడ్మింటన్ కెప్టెన్‌గా ఎస్‌కే అంకూస్, చెస్, టేబుల్ టెన్నిస్ కెప్టెన్‌గా పి.శివకుమార్, క్యారమ్స్ కెప్టెన్‌గా డి. వినయ్‌కుమార్, కల్చరల్ కెప్టెన్‌గా రమేశ్, ఉమెన్ రెప్రజెంటేటివ్‌గా మమతను ఎన్నుకున్నట్లు తెలిపారు.

డిమాండ్లు నెరవేర్చాలని అంగన్‌వాడీల నిరసన

ఆసిఫాబాద్‌అర్బన్: అంగన్‌వాడీలు డిమాండ్లను నెరవేర్చాలని నిరవధిక సమ్మె చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో శుక్రవారం కలెక్టరేట్ ఎదుట ఆవుకు వినతిపత్రం అందజేసి నిరసన తెలిపారు. సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు రాజేందర్ మాట్లాడుతూ మంత్రి సత్యవతి రాథోడ్ తప్పుడు ప్రచారం మానుకోవాలని, మంత్రి వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. నాయకులు వనిత, అంజలి, పద్మ, ధనలక్ష్మి, సరోజ, విజయలక్ష్మి, స్వాతి, రాజమణి, రాజమ్మ, నాగలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

కెరమెరి: గడిచిన కొద్ది రోజులుగా అంగన్‌వాడీలు చేస్తున్న సమ్మె నేపథ్యంలో అధికారులు బెదిరింపులు మానుకోవాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు పెరుక శ్రీకాంత్ అన్నారు. శనివారం మండలంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట కొనసాగుతున్న సమ్మెలో పాల్గొని ఆయన మాట్లాడారు. స్రవంతి, అనసూయ, గుణసుందరి, అమలేశ్వరి, మంజుల, సావిత్రి, సరోజ, లింగుబాయి, జనాబాయి తదితరులు ఉన్నారు.



కెరమెరి: మాట్లాడుతున్న శ్రీకాంత్

కౌటాల: అంగన్‌వాడీల సమ్మెలో భాగంగా 13వ రోజు శనివారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట అంగన్‌వాడీలు కళ్లు, చెవులు, నోరు మూసుకొని నిరసన వ్యక్తం చేశారు. వారు మాట్లాడుతూ అంగన్‌వాడీల డిమాండ్లు నెరవేర్చాలని పేర్కొన్నారు. అంగన్‌వాడీ టీచర్లు శ్యామల, జీజాబాయి, ఇందు, మోక్ష, హేమవతి, ఆయాలు, పాల్గొన్నారు.



ఆసిఫాబాద్‌అర్బన్: ఆవుకు వినతిపత్రం అందిస్తూ..

దహెగాం: మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట 13వ రోజు శనివారం అంగన్‌వాడీల సమ్మె కొనసాగింది. తమ సమస్యలు పరిష్కరించే వరకు సమ్మె కొనసాగిస్తామని తెలిపారు. సమ్మెకు పంచాయతీ కార్మికులు మద్దతు పలికారు. సమ్మెలో అంగన్‌వాడీలు జయప్రద, జ్యోతిలక్ష్మి, మమత, లక్ష్మి, కార్మికులు రమేశ్, ప్రభాకర్‌గౌడ్, రవీందర్, రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

రైతులకు పంట నష్టపరిహారం చెల్లించాలి

కాగజ్‌నగర్‌టౌన్: ప్రాణహిత, పెద్దవాగు పరీవాహక ప్రాంతాల్లో పంటలు నష్టపోయిన రైతులకు రాష్ట్ర ప్రభుత్వం వెంటనే నష్టపరిహారం చెల్లించాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు డాక్టర్ హరీశ్‌బాబు డిమాండ్ చేశారు. శనివారం తన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో స్థానిక నేతలతో కలిసి మాట్లాడారు. గత ఐదు సంవత్సరాలుగా ప్రాణహిత, పెద్దవాగు పరీవాహక ప్రాంతాల్లో పెద్ద ఎత్తున పంట నష్టం జరిగి రైతులు ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఏటా సిర్పూర్, కౌటాల, చింతలమానెపల్లి, పెంచికల్‌పేట్, బెజ్జూర్, కాగజ్‌నగర్, దహెగాం మండలాల్లో పంట నష్టం జరుగుతోందని, ప్రధాన మంత్రి ఫసల్ బీమా యోజన కింద రాష్ట్ర ప్రభుత్వం తన వాటా కట్టకపోవడంతో పంటల బీమా అమలు కావడంలేదని పేర్కొన్నారు.

వాహనాల తనిఖీ

కౌటాల: మండలంలోని ముత్తంపేట గ్రామ సమీపంలో కౌటాల -కాగజ్‌నగర్ ప్రధాన రహదారిపై శనివారం ఎస్సై వాహనాల తనిఖీ చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాహనదారులు నిబంధనలు పాటించాలని, పరిమితికి మించి ప్రయాణికులను తరలించొద్దన్నారు. మావోయిస్టుల ఆవిర్భావ వారోత్సవాల నేపథ్యంలో వాహనాల తనిఖీ చేసినట్లు తెలిపారు.

భక్తిశ్రద్ధలతో బొజ్జ గణపయ్యకు పూజలు



రెబ్బెన: వినాయకుడిని దర్శించుకుంటున్న జీఎం



కౌటాల: వినాయకుడికి పూజలు చేస్తున్న భక్తులు

కౌటాల: మండలంలోని ఆయా మండపాల్లో శనివారం భక్తులు గణనాథుడికి భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు. మండల కేంద్రంలోని సదాశివపేట కాలనీలో గల వాసవీమాత ఆలయంలోని వినాయకుడిని శనివారం భక్తులు గరకమాలతో అలంకరించారు. గణేశ్ మండపాల వద్ద నిర్వాహకులు అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు.

రెబ్బెన: గణేశ్ నవరాత్రి ఉత్సవాలు పురస్కరించుకొని శనివారం గ్రామాల్లో ప్రతిష్ఠించిన బొజ్జ గణపయ్య విగ్రహాలకు భక్తులు అత్యంత భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు. ఉదయం, సాయంత్రం వేళల్లో వేద పండితుల మంత్రోచ్ఛరణలతో స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తూ నైవేద్యాలు సమర్పించారు. రెబ్బెన ఎంపీపీ జుమ్మిడి సౌందర్య ఆనంద్ దంపతులు మండల కేంద్రంలో గణేశుడిని దర్శించుకున్నారు. కైరిగూడ ఓసీపీలో ప్రతిష్ఠించిన గణేశుడిని బెల్లంపల్లి ఏరియా జీఎం రవిప్రసాద్ దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.

సమ్మె విజయవంతం చేయండి

ఆసిఫాబాద్‌అర్బన్: ఆశా వర్కర్లకు ఫిక్స్‌డ్ వేతనాన్ని రూ.18వేలు చెల్లించాలని, ఇతర డిమాండ్లను ప్రభుత్వం నెరవేర్చాలని ఈనెల 25వ తేదీ నుంచి తలపెట్టిన సమ్మెను విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి శ్రీనివాస్ కోరారు. శనివారం జిల్లా కేంద్రంలోని బీసీ భవనంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా సుమారు 28వేల మంది ఆశా కార్యకర్తలు పని చేస్తున్నారని తెలిపారు. సమస్యల పరిష్కారం కోసం రేపటి నుంచి తలపెట్టిన నిరవధిక సమ్మెలో పూర్తి స్థాయిలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు పద్మ, వనిత, రాజేశ్వరి, లక్ష్మి, నవీన, లలిత తదితరులు పాల్గొన్నారు.

చిత్తడి రోడ్లతో తిప్పలు



రోడ్డుపై నిలిచిన మురికి నీరు



బురదగా మారిన నీంగూడ రోడ్డు

ఇందాపూర్ నుంచి దేవుడ్‌పల్లి వరకు ఉన్న రోడ్డుపై గుంతలు పడడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గుంతల్లో మురికి నీరు చేరడంతో రాకపోకలకు అవస్థలు పడుతున్నారు. ఆగుర్‌వాద నుంచి నీంగూడ వరకు ఉన్న మట్టిరోడ్డుపై ఇటీవల మట్టి, మొరం పోసినా వాహనదారులకు ప్రయాణ బాధలు తప్పడం లేదు. వర్షం కురిసినప్పుడల్లా బురదగా మారి నడిచేందుకు కూడా యోగ్యంగా ఉండడం లేదు. అధికారులు స్పందించి బీటీ రోడ్లు వేయాలని ప్రజలు కోరుతున్నారు. – కెరమెరి

ప్రశాంతంగా 'ఎన్ఈఏఎస్' పరీక్ష

కెరమెరి: మండలంలో శనివారం ఎన్ఈఏఎస్ (నేషనల్ ఎడ్యుకేషన్ అచీవ్‌మెంట్ సర్వే) పరీక్ష ప్రశాంతంగా కొనసాగింది. మండలంలో 3వ తరగతి విద్యార్థులు 417, 6వ తరగతికి చెందిన 496 మంది విద్యార్థులు పరీక్ష రాశారు.